నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | గురువారం 26 అక్టోబర్ 2023

మీవి ఆరు గ్యారంటీలు అయితే..
కేసీ'ఆరు' మా గ్యారంటీ

కారు.. సారు.. కేసీఆర్‌కు సాటి ఎవరు రారు
ఈసారి కొడుతుంది బీఆర్ఎస్ తీన్మార్

దేశానికి తెలంగాణ మాడల్..
కేసీఆర్ అంటే ప్రతిపక్షాలకు హడల్

కేసీఆర్‌పై పోటీకి నై.. నై..
సీఎం కుర్చీ ఎక్కేందుకు సై.. సై

ఐటీలో తెలంగాణ మేటి..
కేటీఆర్‌కు ఎవరు సాటి

• మాలోతు సురేష్

**91827 77222**

హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు, ఫొటో పంపడం మర్చిపోకండి.

## నాడు-నేడు

• మోయలేని బరువు...



'బిడ్డా...మన వాకిట్లనే మంచినీళ్లు దొరికినట్టు కలచ్చిందే...' అన్నది మల్లవ్వ. 'అయ్యేటి కలలు కనరాదే అవ్వ... నడువ్ ముందు' అంటూ ఒకచేతిలో బిందె మరో చేతిలో బకెట్ పట్టుకుని పరుగుదీసింది గంగవ్వ. అవును ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పల్లెపడుచుల కల ఇది. గొంతు తడవాలంటే పెద్దవాళ్లే కాదు, ఏడెనిమిదేళ్ల బిడ్డలూ నీళ్ల కోసం కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి. అప్పటి మోయలేని ఆ బరువైన బతుకుల్ని సూచిస్తుంది...నిజామాబాద్ జిల్లా వర్ని మండలం కోకల్‌దాస్ తండా దగ్గరిదీ చిత్రం.

• లేదిక కరువు...




మరో పక్క... అచ్చం మల్లవ్వలాంటి కలే ఉద్యమ నాయకుడు కేసీఆర్ కన్నారు. ఒక్క ఆ గ్రామానికే కాదు... తెలంగాణ పల్లెపల్లెనా ఇంటి ముందు మంచినీళ్ల సవ్వడి వినిపించాలని ఆశపడ్డారు. గ్రామాలు, పట్టణాలే కాదు, లంబాడీ తండాలూ, ఆదివాసీ గూడేల్లోనూ ఏ ఆడబిడ్డా తల మీద బిందె ఎత్తాల్సిన పరిస్థితే లేకుండా చేశారు. మిషన్ భగీరథతో స్వచ్ఛమైన నీటిని వాకిట్లోకి తీసుకువచ్చారు. ఇప్పుడు అదే కోకల్‌దాస్‌లోని లంబాడాలు నల్లాపైపులతో బిందెల్లో నీళ్లు సంతోషంగా నింపుకొంటున్నారు.

▪ సెలబ్రిటీ స్పెషల్

## కొత్త ఫ్లైఓవర్లు చూసి ఆశ్చర్యపోయా..

గత పదేండ్లలో హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధిని చూస్తే కేసీఆర్ ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే అంటున్నారు సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ్. హైదరాబాద్‌తో తనకు ఉన్న అనుబంధం, నగరం అభివృద్ధి చెందుతున్న తీరు గురించి 'నమస్తే తెలంగాణ'తో తమ్మారెడ్డి తన అభిప్రాయాలను పంచుకున్నారు.




**కూడు,** గూడు, గుడ్డ.. ఈ మూడింటికీ ఢోకా లేకపోతే గౌరవంగా బతుకుతున్నట్టే. ఈ మూడింటినీ ప్రజలకు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చాలా కృషి చేసింది. పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇవ్వడం, మంచినీటి కొరతను తీర్చి సామాన్య ప్రజలకు తాగునీటి గోసను తీర్చడం వంటి మంచి పనులను కచ్చితంగా మెచ్చుకోవాల్సిందే. ముఖ్యంగా ఈ పదేండ్లలో హైదరాబాద్ నగరం చాలా అభివృద్ధి చెందింది. కరోనా సంక్షోభ సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా మారినప్పుడు.. దానినే అదనుగా తీసుకొని అద్భుతమైన కొత్త రోడ్లను నిర్మించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని, ఇందుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్‌ను అభినందించకుండా ఉండలేం. హైదరాబాద్



లాంటి మహానగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించడం అంత తేలిక కాదు. అయినా, ప్రభుత్వం ఈ విషయంలో సక్సెస్ అవుతున్నది. నగరంలో కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్లు, రోడ్లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు చూసి ఆశ్చర్యపోతుంటాను. నగరంలో డ్రైనేజీ, నాలాల సమస్యలు ఉండేవి. కేసీఆర్ ప్రభుత్వం డ్రైనేజీ, నాలా వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ సమస్యలను పరిష్కరిస్తుండటం సంతోషకరం. నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. ఇప్పుడు మన నగరం ఇంతలా అభివృద్ధి చెందుతూ ఉండటం చూస్తుంటే చాలా సంతోషంగా ఉన్నది. రోమ్‌లో బతికేవాడు రోమన్‌లా బతకాలి అంటారు. అలాగే హైదరాబాద్‌లో జీవించే వారంతా ఎలాంటి సమస్యలు లేకుండా తెలంగాణ బిడ్డలుగానే జీవిస్తున్నారు.

▪ ఫన్‌టాస్టిక్




## అభ్యర్థులు లేరోచ్.. నామినేషన్ తూచ్!

కమలం అధ్యక్షుడి ఇంటి దగ్గర చోటా నేతలు వేచి ఉన్నారు. ఆయనేదో సీరియస్ చర్చల్లో ఉన్నారని అనుకుంటున్నారు. ఇంతలోనే అటెండర్ బయటకొస్తే కొందరు అతన్ని చుట్టు ముట్టి 'అధ్యక్షుల వారు ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారా?' అని అడిగారు. అటెండర్ అలా అడిగిన వారిని ఎగాదిగా చూసి 'అభ్యర్థులా ఎందుకు?' అని ఆశ్చర్యంగా పలికాడు.

'అదేంటోయ్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది.. అభ్యర్థులను ఎంపిక చేయకపోతే ఎలా? మనమే అధికారంలోకి రాబోతున్నాం... అని, రోజుకు డజనుసార్లు చెబుతున్నాం. నువ్వు రహస్యం దాస్తున్నావు? నీ స్ట్రాటజీ మాకు తెలియదు అనుకోకు. అభ్యర్థుల పేర్లు అడుగుతామని, నువ్వు అలా అంటున్నావు... మాకు తెలుసు లే' అని కోరస్ పలికారు. 'స్ట్రాటజీ లేదూ... గాడిద గుడ్డూ లేదు... మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ లేవడు .. ఇదేంటి సార్ అంటే ఆలస్యంగా లేవడం వెనుక పెద్ద స్ట్రాటజీ ఉంది అంటాడు' అని చెప్పి వెళ్లిపోయాడు.

అటెండర్ చెప్పినట్టుగానే కమలాధ్యక్షులవారు పన్నెండు తరువాత వాళ్లని లోపలికి పిలిచారు. చోటా నేతలు అంతా లోనికి వెళ్లేసరికి కమలాధ్యక్షులు కుర్‌కురే తింటూ ఏదో ఆలోచిస్తున్నారు. 'అభ్యర్థుల గురించే ఈ ఆలోచన' అని అంతా మనసులోనే అనుకున్నారు. 'ఏంటీ ఇలా వచ్చారు' అని ప్రశ్నించారు అధ్యక్షులు.

*'ఎన్నికలకు రోజులు దగ్గర పడ్డాయి. అభ్యర్థులను ప్రకటిస్తే ప్రచారం చేసుకుంటాం' అని పలికారు వెళ్లిన వాళ్లంతా. 'మీ ముగ్గురూ గత ఎన్నికల్లో పోటీ చేశారు కదా! మీకెన్ని ఓట్లు వచ్చాయి?' అని అధ్యక్షుడు ప్రశ్నించారు.*

'సార్... ఆడవాళ్ల వయసు, మగవారి జీతం, కమలం అభ్యర్థులకు వచ్చిన ఓట్లు... అడగొద్దు' అని ఒక నేత చెప్పగానే, అంతా ఘొల్లున నవ్వారు. మాకే కాదు మన పార్టీ తరపున పోటీ చేసిన 105 మందికీ డిపాజిట్ రాలేదు' అని చెప్పుకొచ్చారు.

'ఎలాగూ డిపాజిట్లు పోగొట్టుకోవడానికి ఇంత హైరానా ఎందుకు...' అని అధ్యక్షుడు విసుగ్గా అడిగాడు. వెనుక నుంచి ఎవరో 'వసూళ్లకు..' అని గట్టిగా అరిచారు.

'అదేంటో మనకు ఓట్లు తక్కువ .. వసూళ్లు ఎక్కువ' అని మరొకరు జోక్ చేశారు.

'అన్ని పార్టీలూ తమ అభ్యర్థులను ప్రకటించిన తరువాత మనం మన జాబితా విడుదల చేస్తాం. దీని వెనుక పెద్ద స్ట్రాటజీ ఉంది'అని అధ్యక్షుడు సెలవిచ్చారు.

'పోటీ చేయడానికి ఎవరూ దిక్కు లేరు. కాబట్టి, ఇతర పార్టీల్లో టికెట్ ఆశించి భంగపడ్డ అభ్యర్థులు వస్తే టికెట్ ఇస్తామని సార్ ఎంత బాగా చెబుతున్నారో...'అని ఓ చోటా నేత మురిసిపోయాడు.

***

'సార్ గత వారం వస్తే పెద్ద స్ట్రాటజీ ఉంది. అందుకే ఆలస్యంగా అభ్యర్థులను ప్రకటిస్తాం అన్నారు. ఇప్పుడేమో ఇంకా ఆలోచనలోనే ఉన్నారు. కానీ, జాబితా బయటకు రాలేదు. నామినేషన్‌లు దాఖలు చేయడానికి చివరి రోజు కూడా వచ్చేస్తున్నది. అభ్యర్థులను ఇంకెప్పుడు ప్రకటిస్తారు సార్...' అని చోటా నేతలు దిగులుగా అడిగారు.

'ప్రతి ఆలస్యం వెనుకా ఒక స్ట్రాటజీ ఉంటుంది. అది మీకు తెలియదు. అర్థం కాదు, వెళ్లండి...' అని అధ్యక్షుడు గట్టిగా చెప్పారు.

'మన అధ్యక్షుడి స్ట్రాటజీ అర్థం అయింది. ఎన్నికల్లో పోటీ చేస్తేనే కదా డిపాజిట్ పోయేది. అసలు పోటీనే చేయకపోతే డిపాజిట్ గల్లంతయ్యే అవకాశమే లేదు. గత ఎన్నికల్లో 102 స్థానాల్లో డిపాజిట్ పోగొట్టుకున్నాం అని, అంతా ఎగతాళి చేస్తున్నారు. కానీ ఈసారి, అన్ని స్థానాల నుంచీ పోటీ చేయకుండా ఉంటే , డిపాజిట్ డబ్బులు మిగులుతాయి. డిపాజిట్లు దక్కని పార్టీ అంటూ మాటలు పడాల్సిన అవసరమూ ఉండదు. సార్ స్ట్రాటజీ సూపరో సూపరు. అసలిది పేలి పోయే స్ట్రాటజీ అంతే...' అని ఓ నేత మురిసి పోతే ... 'పేలి పోయే స్ట్రాటజీ కాదు... పువ్వు వాలిపోయే స్ట్రాటజీ...' అని మరో నేత అందరికీ వినిపించేలా అనేశాడు.

▪ మురళి

# మీసం మెలేసిన అభివృద్ధి

## రేవంత్ ఇలాఖాలో నరేందర్ తడాఖా

కొడంగల్ దంగల్

**నాయకుడు వేసే అడుగు ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించాలి. ప్రజాప్రతినిధి చేసే యోచన నిరుపేదలకు ప్రయోజనం చేకూర్చాలి. కానీ, తాను తీస్మార్‌ఖాన్ అని చెప్పుకొనే టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఈ మాటలు అస్సలు వర్తించవు. మీసాలు తిప్పడాలు, తొడలు గొట్టడాలే సిసలైన లీడరిజం అని ఆయన భావన! అందుకే, రెండు దఫాలు కొడంగల్‌కు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించినా నియోజకవర్గంలో ఏ వర్గానికీ ఎలాంటి లబ్ధినీ చేకూర్చలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో కొడంగల్ దశ మారింది. ఊరూరా జరిగిన అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుండగా, ఈసారీ ఓటమి తప్పదన్న ఫ్రస్ట్రేషన్ రేవంత్ ముఖంలో ప్రస్ఫుటిస్తున్నది.**



**తెలంగాణలో** కొడంగల్ నియోజకవర్గం పేరు తెలియనివారు ఉండరు. కానీ, తొమ్మిదేండ్ల కిందటి వరకు కొడంగల్ వాసులను పలకరిస్తే 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అని సమాధానం వచ్చేది. ఇప్పుడు కొడంగల్‌వాసి ముఖంలో కొండంత సంతోషం తొణికిసలాడుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాకతో నియోజకవర్గ ముఖచిత్రమే మారిపోయింది. ఒకప్పుడు కొడంగల్ పరిధిలోని దారులన్నీ గతుకులు, అతుకులతో ప్రయాణ భారాన్ని పదింతలు పెంచేవి. గుక్కెడు నీటి కోసం వాగుల్లో చెలిమెలు తీసిన చేతులెన్నో! అదే వానొస్తే.. వాగులు పొంగి పక్క ఊరితో సంబంధాలు తెగిపోయేవి. చిన్న సుస్తీ చేసినా పాలమూరుకు పరుగులు తీయడం తప్ప మరో గత్యంతరం ఉండేది కాదు. ఈ కష్టాలన్నిటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇప్పుడు దారులన్నీ హైవేలను తలపించేలా కొత్తరూపును సంతరించుకున్నాయి. గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు, మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రం వరకు డబుల్ రోడ్లను అభివృద్ధి చేయడంతో ప్రయాణ భారం తగ్గిపోయింది. మిషన్ భగీరథ పుణ్యాన కృష్ణమ్మ జలాలతో కొడంగల్ ప్రజలు తృప్తిగా దాహార్తిని తీర్చుకుంటున్నారు. కొత్తగా వెలసిన పల్లె దవాఖానలు, పట్టణ ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నాయి. శరవేగంగా నిర్మాణమవుతున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు పూర్తయితే నియోజకవర్గంలోని లక్షాయాభైవేల ఎకరాలకు దండిగా సాగునీరు అందుతుంది.

| పథకం | లబ్ధిదారుల సంఖ్య | |
|---|---|---|
| రైతుబంధు 91,229 | కల్యాణలక్ష్మి 8,860 | ఆసరా పింఛన్లు 37,236 |
| రైతుబీమా 1,647 | షాదీ ముబారక్ 1,000 | కేసీఆర్ కిట్స్ 9,129 |

**కొడంగల్ ఇజ్జత్ బర్‌బాత్..**

పదేండ్లపాటు కొడంగల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పనిచేసిన రేవంత్ కనీసం ఒక్కటంటే ఒక్క గ్రామానికి రోడ్డు వేసేందుకు నిధులు తీసుకురాలేకపోయారు. తాగునీటికి అలమటించిన ప్రజల కన్నీటి కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. నియోజవర్గాన్ని ఉద్ధరించకపోగా, బ్లాక్‌మెయిల్ దందాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారన్న విమర్శలు ఉన్నాయి. పైగా ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి కొడంగల్ పేరును గంగలో కలిపాడని స్థానికులు పెదవి విరుస్తున్నారు. రేవంత్ అసలు స్వరూపం బయటపడటంతో 2018 ఎన్నికల్లో ఓటర్లు ఆయనకు కర్రుకాల్చి వాతపెట్టారు. పట్నం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకొని తమ ప్రాంత అభివృద్ధికి నాంది పలికారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సీఎం అవుతానని రేవంత్ గప్పాలు పలుకుతున్నా.. బీఆర్ఎస్ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు కండ్లారా చూసిన కొడంగల్ ఓటర్లు మరోసారి గులాబీ జెండాకే తమ మద్దతని ముక్తకంఠంతో నినదిస్తున్నారు.



**తొమ్మిదేండ్లలో రూ.1500 కోట్ల నిధులు**

కొడంగల్‌లో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదు. రూ.1,500 కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గ అభివృద్ధి ఊహించిన దానికన్నా మిన్నగా కొనసాగింది. సంక్షేమ పథకాలతోపాటు వాగులపై చెక్‌డ్యాంలు, ప్రభుత్వాసుపత్రులు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలు, మినీ ట్యాంక్‌బండ్, గురుకుల పాఠశాలలు, బస్‌డిపో, బస్ స్టేషన్‌లు ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి పరుగులు పెట్టింది. మూడు దశాబ్దాలుగా సరైన రవాణా లేక తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్న కోస్గి ప్రజల బస్‌డిపో కల ఇన్నాళ్లకు నెరవేరింది. కొడంగల్, కోస్గిలను ప్రభుత్వం మున్సిపాలిటీలుగా ప్రకటించింది. వాటి అభివృద్ధికి కోట్ల నిధులు వెచ్చించింది. రెండు చోట్లా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటైంది. సీసీ రోడ్లు, దుకాణ సముదాయాలు, పార్కులు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటుతో రెండూళ్లు కొత్త కళను సంతరించుకున్నాయి. కొడంగల్‌లో 30 పడకల ప్రభుత్వాసుపత్రి, కోస్గిలో 50 పడకల దవాఖాన, మద్దూరులో 30 పడకల హాస్పిటల్ అందుబాటులోకి వచ్చాయి. కొడంగల్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో కిడ్నీ వ్యాధి బాధితులకు కొండంత ఊరట లభించింది. నియోజకవర్గంలోని బొంరాసుపేట్‌లో బీసీ, కొడంగల్‌లో మైనార్టీ, మద్దూరులో ఎస్సీ గురుకులాలు మంజూరు చేయడంతో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నది. కొడంగల్, కోస్గిలో యాదవ భవనాలు, ముదిరాజ్ భవనాలు, అంబేద్కర్ భవన్, కొడంగల్‌లో బంజారాభవన్‌ను నిర్మించి అన్ని వర్గాలకూ అండగా నిలిచింది ప్రభుత్వం. మొత్తంగా 'ఇది నా అడ్డా' అని రొమ్ము విరిచే టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులు చూసి తన భవిష్యత్తుపై బెంగపడటంలో వింతలేదు.

▪ ద లీడర్..

# ఉద్యమబాటలో పేలిన తూటా

**సీఎం** కేసీఆర్‌కు కుడిభుజంగా ఉన్నవాళ్లల్లో గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఒకరు. విప్లవ విద్యార్థి ఉద్యమాల్లో మమేకమై పనిచేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. న్యాయవాదుల సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో పురుడు పోసుకున్న నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ ఆవిర్భావ సభ్యుడిగా కొనసాగుతున్నారు. సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన తెలంగాణ కోసం జరిగిన అన్ని ఉద్యమాల్లో కేసీఆర్ వెంట నడిచారు. జలసాధన ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. అలంపూర్ టూ ఆర్డీఎస్‌కు జరిపిన 45 రోజుల పాదయాత్రకు బ్రిగేడియర్‌గా వ్యవహరించారు.

**జైలులోనే పండుగలు**

రైతులకు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో జాతీయరహదారిపై రాస్తారోకో చేశారు. 2002లో కుడి కాల్వకు సాగర్ నీటిని విడుదల చేసి, ఎడమ కాల్వను ఎండబెడితే నార్కట్‌పల్లి వద్ద మహిళలతో నిర్వహించిన రాస్తారోకో అప్పట్లో సంచలనం. ఈ ఘటనతో సమైక్యపాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఫలితంగా 9 రోజులు జైలు జీవితం గడిపారు. 2008లో ప్రణబ్‌ముఖర్జీ నిజామాబాద్ పర్యటన సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. అప్పట్లో టీఆర్ఎస్ కార్యకర్తలపై లగడపాటి రాజగోపాల్ దౌర్జన్యంగా కారు నడిపించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ మెరుపు ఉద్యమాన్ని చేపట్టింది. లగడపాటి రాజగోపాల్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా, నిరసనకు పోలీసులు అరెస్టు చేస్తే 15 రోజులు జైలులో ఉన్నారు. ఆయనకు దసరా, దీపావళి పండుగలు జైల్లోనే అయ్యాయి. సూర్యాపేటలో తెలంగాణ ఉద్యమకారులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని నాటి ఎమ్మెల్యే అనుచరులు కూల్చివేస్తే అందుకు ప్రతిగా భారీ ర్యాలీ నిర్వహించారు.

### జగదీశ్ వెంటే జనం

**హ్యాట్రిక్ దిశగా అడుగులు**

2014, 2018 ఎన్నికల్లో సూర్యాపేట నుంచి వరుస విజయాలు సాధించిన జగదీశ్‌రెడ్డి హ్యాట్రిక్ దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ తొలి విద్యాశాఖ మంత్రిగా కొంతకాలం పనిచేసిన ఆయన తరువాత నుంచి విద్యుత్‌శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామని సీఎం కేసీఆర్ చేసిన శపథం, దాన్ని అమలు చేసేందుకు అధినేత కేసీఆర్ అప్పగించిన హోంవర్క్ క్రమం తప్పకుండా పూర్తి చేస్తారనే పేరు ఆయన సొంతం. అలాగే 2018 ఎన్నికల తరువాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, మునుగోడు ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉపఎన్నికలల్లో జిల్లా మంత్రిగా వరుసగా వాటిని గెలిపించి హ్యాట్రిక్ విజయాలను నమోదు చేశారు. చేసే పనిపట్ల నిబద్ధత... ఓర్పు... సహనం... నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతోపాటు తాను నమ్మిన వారి పట్ల విధేయుడిగా ఉంటూ, తనను నమ్మిన వారిని అంతే కాపాడుకుంటారని జగదీశ్‌రెడ్డి పేరు తెచ్చుకోవటం విశేషం.

